కథ

# జీవన సాఫల్యత



గాజోజు నాగభూషణం
98854 62052

“రాజేష్! రేపు నేను మాధవ్ అంకుల్ దగ్గరికి, కరీంనగర్ వెళ్లాలి. ప్రయాణానికి కావాల్సిన ఏర్పాట్లు చెయ్. ఎన్ని రోజులుంటానో తెలియదు. మెడిసిన్స్, డ్రెస్సులు.. ఇంకా అవసరమైనవన్నీ సిద్ధం చేయించు” అన్నాడు సాగర్.. కొడుకుతో.

“అదేంటి నాన్నా! అసలే మీ ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంది. ఇప్పుడు ప్రయాణమేమిటి? కొంచెం కోలుకున్నాక వెళ్లొచ్చు కదా!?” అన్నాడు రాజేష్.

“ఇప్పుడు వెళ్లకపోతే ఎప్పుడు వెళ్తానో చెప్పలేను. అక్కడికి వెళ్లకపోతే తీరని అసంతృప్తి, అశాంతి మిగిలిపోతుంది. నన్ను వెళ్లనివ్వు”.. శాసిస్తున్నట్లు అన్నాడు సాగర్.

నాన్న ఒక నిర్ణయానికి వస్తే ఇక ఎవ్వరి మాటా వినడన్న విషయం తెలిసిన రాజేష్.. అన్యమనస్కంగానే ‘సరే!’ అన్నాడు.

సాగర్.. ఎలక్ట్రానిక్స్ రంగంలో అంతర్జాతీయంగా పేరు గడించిన ప్రముఖ వ్యాపారవేత్త. ఇంజినీరింగ్ చేసిన తరువాత, అమెరికా వెళ్లి వ్యాపారాన్ని ప్రారంభించి.. వేలకోట్ల టర్నోవర్‌తో ఇటు భారత్‌లోనూ, అటు ఇతర దేశాల్లోనూ విస్తరింపజేసి.. బిలియనీర్‌గా ఎదిగాడు. పెద్దకొడుకు అఖిల్ తనతోపాటు అమెరికాలో వ్యాపార లావాదేవీలు చూస్తుండగా, చిన్నకొడుకు రాజేష్ భారత్‌లో బిజినెస్ చూసుకుంటున్నాడు.

ఎప్పుడో రక్తసంబంధీకుల వివాహాలు మొదలైన వేడుకలు, వ్యాపారానికి సంబంధించిన ముఖ్యమైన సందర్భాల్లో తప్ప భారత్‌కు రాని సాగర్.. తన డెబ్బై ఏళ్ల వయసులో, విదేశాల్లో ఉన్న తన వ్యాపార కార్యకలాపాలన్నీ పెద్ద కొడుక్కు అప్పజెప్పి, ఈమధ్యనే భారత్ వచ్చాడు. అదికూడా హైలెవల్ బీపీ, షుగర్, సెకండ్ స్టేజ్ ప్రోస్టేట్ క్యాన్సర్ మొదలైన వార్ధక్య వ్యాధులతో స్వదేశానికి శాశ్వతంగా తిరిగి వచ్చాడు.

రెండేళ్ల క్రితమే భార్య చనిపోయి, ఒంటరితనాన్ని అనుభవిస్తున్న సాగర్‌లో, భారత్ వచ్చినప్పటి నుంచీ ఇన్నాళ్లులేని ఒక సంఘర్షణ మొదలైంది. ఇంతకాలం వ్యాపారంలో తలమునకలై ఉండి, క్షణం తీరిక లేకుండా గడపడం వల్ల ఈ సంఘర్షణకు తావు లేకుండే. ఊహించని వ్యాధులు చుట్టుముట్టి, శరీరం శుష్కించి, సత్తువ, చైతన్యం సన్నగిల్లాక.. మొదటిసారి ఈ సంఘర్షణకు లోనై, చెట్టును చెదపురుగు తొలిచినట్టు.. అనేక ఆలోచనలు తన మనసును తొలుస్తున్నాయి.

‘పరిగెత్తీ పరిగెత్తీ సాగే జీవిత ప్రస్థానానికి అంతిమ పరమార్థం ఏమిటి? రాత్రీ పగలు కష్టపడి, పోటీ ప్రపంచంలో విజేతగా నిలవడానికి ఎంత వ్యక్తిగత జీవితాన్ని, ఎన్ని సంతోషాలను త్యాగం చేశాను. మరిప్పుడు నేను విజేతనా.. పరాజితుణ్నా? ఇంత సంపద నన్ను వ్యాధి పీడితున్ని కాకుండా ఆపగలిగిందా? అంతిమదశలో ఆనందంగా జీవితాన్ని ముగించే ఆహ్లాదకర పరిస్థితుల్ని మిగిల్చిందా? వ్యాపారంలో నెగ్గడానికి ఎన్ని అపసవ్య మార్గాలను ఎంచుకున్నాను? ఇంతా చేసి, ఇదంతా మనిషి జన్మ ఎత్తినందుకు జీవితానికి సార్థకతను చేకూర్చిందా?’ అన్న తాత్విక ఆలోచలన్నీ తాచుపాములై చిత్తంలో బుసలు కొడుతున్నాయి.

ప్రయాణం ఆరంభమైనప్పటి నుంచీ తన చిన్ననాటి స్నేహితులు, సొంత ఊరైన కరీంనగర్ జ్ఞాపకాలు.. కారుతో పోటీ పడుతూ, వేగంగా అతని మనోమైదానంలో పరుగులు తీస్తున్నాయి.

ఇప్పటి ఈ తలపోతల తలుపు తట్టిన మరో కారణమూ ఉంది. తన బాల్యస్నేహితుడు, ఇంటర్మీడియెట్ వరకూ సహాధ్యాయి అయిన మాధవ్ జీవితంతో, తన జీవితాన్ని పోల్చుకుంటున్నాడు.

ఉపాధ్యాయుడిగా రిటైర్ అయినప్పటి నుంచీ కొన్నాళ్లుగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో, శాస్త్రీయ అవగాహనను విస్తరింపజేయడంలో మాధవ్ చేస్తున్న కార్యక్రమాల వార్తల పేపర్ కటింగ్స్ అన్నీ సాగర్‌కు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నాడు. మొదట్లో వాటిని శ్రద్ధగా చదివినా, అవన్నీ ఏదో వాడి కాలక్షేపానికి చేస్తున్న కార్యక్రమాలని అనుకొని మళ్లీ మర్చిపోయేవాడు.

కానీ, ఈ మధ్యన వరు